వారాంతం కావడంతో కోట్‌పల్లి ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు సరదాగా గడిపారు. ప్రాజెక్టు నీటిలో సెల్ఫీలు, బోటింగ్ చేస్తూ ఎంజాయి చేశారు. ప్రాజెక్టు పరిసరాలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు.

- ధారూరు, జనవరి7






లోక కల్యాణం కోసమే సుదర్శన హోమం

● త్రిదండి రామచంద్రజీయర్ స్వామీజీ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి7: లోక కల్యాణం కోసమే సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు త్రిదండి రామచంద్ర జీయర్‌స్వామిజీ అన్నారు. ఎదులాబాద్‌లోని శ్రీగోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో ఆదివారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో గోదాఅమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర జీయర్ స్వామిజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని సూచించారు. దైవచింతనలో కొంత సమయాన్ని గడపాలని, దీంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అలయధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, గోవిందాచార్యులు, సేషాచార్యులు, అచ్యుతాచార్యులు, పవన్‌కుమారాచార్యులు, ఫణికుమారాచార్యులు, అధిత్యాచార్యులు పాల్గొన్నారు.





గ్రామ పంచాయతీ పాలకవర్గాల్లో చర్చ

- పంచాయతీల పదవీ కాలం మరో 25 రోజులే..
- పొడిగిస్తే పర్సన్ ఇన్‌ఛార్జిలుగా కొననున్న సర్పంచులు
- లేకపోతే ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన
- 3, 4 పంచాయతీలకు ఓ ప్రత్యేక అధికారిని నియమించే అవకాశం
- లోక్‌సభ ఎన్నికల తరువాతనే పంచాయతీ పోరు

మరో 25 రోజుల్లో పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగియనుంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించలేదు. రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తున్నా పాలకవర్గాల పదవీ కాలం ముగిసేలోగా ఎన్నికలు జరిగే అవకాశం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న పంచాయతీ పాలక వర్గాలను ఎన్నికలు జరిగే వరకు కొనసాగిస్తారా ? లేక పాలక వర్గాల పదవీ కాలం ముగియగానే వాటి స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన తీసుకు వస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

పొడిగింపా?

వికారాబాద్,(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) జనవరి7: రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన కొద్ది రోజులకే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కానున్నాయనేది స్పష్టమవుతోంది. లోక్‌సభ ఎన్నికల తరువాతనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం వచ్చేనెల ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగియనుంది. నిర్ణీత గడువులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్న ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న పంచాయతీ పాలక వర్గాలను ఎన్నికలు జరిగే వరకు కొనసాగిస్తారా? లేక పాలక వర్గాల పదవీ కాలం ముగియగానే వాటి స్థానంలో

ప్రత్యేకాధికారుల పాలనా?

ప్రత్యేకాధికారుల పాలన తీసుకు వస్తారా అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న క్రమంలో అంత వరకు పంచాయతీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై పంచాయతీ పాలకవర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

పదవీ కాలం పొడిగించేనా!

ఇదిలా ఉంటే, పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు పాలకవర్గాల పదవీ కాలం పొడిగించాలని సర్పంచులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయితే ప్రభుత్వం దీనిపై ఏ నిర్ణయం తీసుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది. పంచాయతీల పదవీ కాలం ముగిసినా... ఎన్నికలు జరిగేంత వరకు కొనసాగుతున్న పాలక వర్గాలనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తే మాత్రం ప్రస్తుతం సర్పంచులనే పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమిస్తారు. పర్సన్ ఇన్‌ఛార్జిలకు బదులుగా ప్రత్యేకాధికారులనే నియమించాలని ప్రభుత్వం భావిస్తే పంచాయతీల పదవీ కాలం ముగియగానే పాలకవర్గాల స్థానంలో పంచాయతీల పాలనా బాధ్యతలను ప్రత్యేకాధికారులు చేపట్టనున్నారు. మూడు నుంచి నాలుగు పంచాయతీలకు ఒక మండల స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించనున్నారు. పంచాయతీ పాలనా పగ్గాలను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే.. లోక్‌సభ ఎన్నికలు ముగిసి పంచాయతీ ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేసేంత వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

తేలని రిజర్వేషన్ల అంశం

పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు సంబంధించిన కసరత్తు ప్రారంభమైనా ఇప్పటి వరకు రిజర్వేషన్ల అంశం తేల్చలేదు. గత ఎన్నికల్లో జిల్లాలోని పంచాయతీల్లో మెజార్టీ స్థానాలు మహిళలకే రిజర్వు అయ్యాయి. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వు చేయడంతో జిల్లాలోని 566 పంచాయతీల్లో సగం పంచాయతీలు మహిళలకు రిజర్వు చేశారు.అన్ని స్థానాల్లోనూ మహిళలకు సగం స్థానాలను రిజర్వు చేశారు. 2011జనాభాను పరిగణనలోకి తీసుకుని ఎస్టీ, ఎస్సీలకు రిజర్వేషన్లు నిర్ధారించారు. బీసీలకు 50శాతం కోటా మించరాదన్న గత ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా బీసీలకు పాలకవర్గ పదవులను రిజర్వు చేశారు. గత పంచాయతీ ఎన్నికలకు ముందు చేపట్టిన ఈ సవరణ ప్రకారం ఈసారి నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. లేని పక్షంలో బీసీ గణన చేపట్టి ఆతరువాత మళ్లీ రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఈ ప్రక్రియ సాఫీగా కొనసాగాలంటే ప్రస్తుతం ఉన్న సమయం సరిపోదు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తరువాతనే పంచాయతీ ఎన్నికలు జరుగుతాయనే స్పష్టమైన సంకేతాలు ఉన్నాయి.

సమీపిస్తున్న గడువు

పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి మరో 25 రోజులు మాత్రమే గడువు ఉంది. ఇంత తక్కువ సమయంలో బీసీ గణన పూర్తి చేయడమనేది అసాధ్యం. గతంలో పంచాయతీలకు ఐదేళ్లకు ఒకసారి రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించేవారు. గత ప్రభుత్వం చట్ట సవరణ తీసుకువచ్చి పంచాయతీల రిజర్వేషన్ల కాలపరిమితిని పదేళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఐదేళ్ల కిందట ఖరారు చేసిన రిజర్వేషన్లను అదే విధంగా కొనసాగిస్తారా? లేకచట్టం ప్రకారం కొత్తగా కేటాయిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

బీసీ గణన పూర్తయ్యాకే పంచాయతీ ఎన్నికలు!

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే బీసీ గణన తప్పనిసరిగా పూర్తి చేయాలి. బీసీ గణన పూర్తి చేసిన తరువాతనే వారికి రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉంటుంది. బీసీ గణనకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కాలేదు. పంచాయతీ ఎన్నికలు జరపాలంటే బీసీ గణన ఆధారంగా పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. బీసీ గణన పూర్తయి రిజర్వేషన్లు ఖరారైన తరువాతనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మార్గం సుగమమవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెల రోజులు మాత్రమే గడిచిన ఈ సమయంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేనట్లు తెలుస్తోంది.

ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డిని ఎవరు కలిశారో చెప్తా!

- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



తాండూరు, జనవరి 7 : ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని రహస్యంగా ఎవరు కలిశారు.. అనేది త్వరలో వెల్లడిస్తామని తాండూరు వికారాబాద్, కొడంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి గిఫ్ట్‌గా ఇస్తానని రేవంత్‌రెడ్డికి చెప్పింది ఎవరో అధిష్ఠానానికి తెలుసునని బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానికి అన్ని విషయాలు తెలుసునని, సమయం వచ్చినప్పుడు పార్టీ పెద్దలు మాట్లాడతారని తెలిపారు. పార్టీకి ద్రోహం చేసిన వారు ఎంతటి హోదాలో ఉన్న వదిలిపెట్టమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేసీఆర్ అనేక ప్రచారా సభల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. ఆసరా పింఛన్లు వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. దళిత బంధు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గంలో 1500 మందిని ఎంపిక చేసి నిధులు సిద్ధం చేశామని వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు.



మాట్లాడుతున్న ఐసీఎస్ఐ అధ్యక్షుడు మనీష్‌గుప్తా

పాలన, అభివృద్ధిలో కార్పొరేట్ చట్టాల పాత్ర

- ఐసీఎస్ఐ అధ్యక్షుడు మనీష్‌గుప్తా

శామీర్‌పేట, జనవరి7: పాలనలో, అభివృద్ధిలో కార్పొరేట్ చట్టాల పాత్ర ఉందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రెటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) అధ్యక్షుడు మనీష్‌గుప్తా అన్నారు. శామీర్‌పేటలోని నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయంలోని నిర్వహించిన మూడు రోజుల పాటు 'కార్పొరేట్ చట్టాలు-భద్రత'పై జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేట్ చట్టం, పాలన రంగంలోని తాజాపోకడలను పురోగతులను చర్చించడానికి ఇదొక మంచి వేదిక అని తెలిపారు .సహచరులతో ఆలోచనలను పంచుకొని వాటికి తగువిధంగా విశ్లేషించడానికి దోహదపడిందని చెప్పారు. వాటాదారుల ప్రయోజనం కోసం ప్రస్తుత చట్టాల్లో అవసరమైన మార్పులను తీసుకురావడమే ఈ సమావేశ ముఖ్య లక్ష్యమని తెలిపారు. తమ మొదటి ఏడీఆర్ కేంద్రాన్ని హైదరాబాద్‌లో మార్చి 30లోగా ప్రారంభించి దేశంలో న్యాయపరమైన పర్యావరణ వ్యవస్థకు మద్దతున్విసున్నట్లు తెలిపారు. నల్సార్ వైస్‌చాన్సలర్, ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ వేడుకలకు సిద్ధమైనట్లు తెలిపారు. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి నల్సార్ యూనివర్సిటీ కార్యకలాపాల పట్ల మంచి ఆసక్తి కనబరిచినట్లు తెలిపారు. ఈసదస్సులో 168 కంపెనీ సెక్రటరీలు, న్యాయనిపుణులు, న్యాయవాదులు, కార్పొరేట్ గవర్నెన్స్‌లో అత్యుత్తమంగా ముందంజలో ఉన్న పరిశ్రమ నాయకులు, కార్పొరేట్ నిపుణులు విధాన రూపకర్తలు, పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఎస్ఐ వైస్ ప్రెసిడెంట్ సీఎస్‌బీ నర్సింహన్, కాన్ఫరెన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.



జాతరలో బోనాలతో ప్రదక్షిణలు

ఘనంగా గిర్మాపూర్ గుట్ట మల్లన్న జాతర

మేడ్చల్‌టౌన్, జనవరి7: గిర్మాపూర్ గుట్టల మల్లన్న జాతర ఉత్సావాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం జనవరి మొదటి వారంలో నిర్వహించే ఈ ఉత్సవాలను నిర్వాహకులు పెద్ద ఎత్తున నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చే సి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం స్థానికులు స్వామి వారికి బోనాలు సమర్పించారు. సాయంత్రం తొట్టెల ఊరేగింపు నిర్వహించారు వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎంపీ సురేష్ రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పి.మోహన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి, ఎంపీపీ రజిత రాజమల్లా రెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారేదెలా!

అధ్వానంగా పంట కాలువలు

- మూసీ పరివాహక ప్రాంతంలో మరమ్మతులకు నోచుకోని నారాయణరావు కాలువ
- ఇబ్బందుల్లో అన్నదాతలు.. పట్టించుకోని పాలకులు
- నాటి మంత్రి మాటలూ బుట్ట దాఖలేనా?
- సమస్యను పరిష్కరించాలని రైతుల డిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 7 : పంట కాలువలు సక్రమంగా లేకపోవటంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పుష్కలమైన సాగు నీటి లభ్యత ఉన్నా నిర్వహణ లేకపోవటంతో పంటలకు నీరు అందడం కష్టతరంగా మారింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని మూసీ పరివాహక ప్రాంతంలో ఈపరిస్థితి నెలకొంది. మూసీనదిపై పీర్జాదీగూడ లోగల నారాయణరావు కత్వ(ఆనకట్ట) నుంచి ఘట్‌కేసర్, హయత్‌నగర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరందుతోంది. కాగా కేవలం ఘట్‌కేసర్ మండలంలోని కాచవనాసింగారం, ప్రతాప్‌సింగారం, సాదత్‌అలీగూడ, మక్తా, కొర్రెముల, వెంకటాపూర్, చౌదరిగూడ, ఎదులాబాద్, పోతరాజుగూడ, కొత్తగూడ గ్రామాల్లో 18.5 కిలోమీటర్ల మేర కాలువ పారుతోంది. దాదాపు 6వేల ఎకరాల మేర పొలాలకు సాగునీరందుతోంది. ఇందులో రైతులు అధికంగా వరి, గిన్నీ గడ్డిని సాగుచేస్తుంటారు. దీంతో పాటు ఆకుకూరలూ విరివిగా సాగు చేస్తుంటారు.



తెనుగూడెం వద్ద గుర్రపుడెక్కతో నిండిపోయిన నారాయణరావు పంట కాలువ

మరమ్మతులు లేక...

ఘట్‌కేసర్ మండల పరిధిలోని పొలాలకు సాగునీరందించే నారాయణరావు కాలువ పారే గ్రామాల్లో కాలువ పరిస్థితి అధ్వానంగా మారింది. దాదాపు ఐదారు అడుగుల లోతు ఉండే కాలువ మొత్తం గుర్రపు డెక్క, గిన్నీగడ్డి పెరిగి మూసుకుపోయింది. దీంతో చివరి వరకు నీరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సాగు నీటి కాల్వలకు పలు చోట్ల నీటి మళ్లింపుకు షట్టర్లు ఏర్పాటు చేశారు. అసలే రసాయనాలతో కూడిన మూసీ నీరుకావటంతో తరచూ తృప్పు పట్టి పాడవుతుంటాయి. ఐనప్పటికీ సంవత్సరాల తరబడి మరమ్మతులు లేకపోవటంతో నీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రైతులు సాగు చేసిన పంటలు ఎప్పుడు ఎండి పోతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రతి సీజన్‌లో వరికోతలు పూర్తి కాగానే రైతులు గ్రామాల వారీగా కాలువల్లో ఉన్న వ్యర్థాలను, గుర్రెపుడెక్కాకు తొలగిస్తూ కాలువలను శుభ్రం చేసుకునేవారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవటంతో కాలువల్లో చాల మేరకు ఒండ్రు మట్టి నిండిపోయి ఉన్నది. దీంతో పాటు పలు చోట్ల కాలువ అక్రమణకు గురైనా పట్టించుకునేవారు కరువయ్యారు. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తుల్లో కాలువ కనుమరుగయ్యే ప్రమాదం పొంది ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నారాయణరావు చానెల్ కాలువపై కొన్నిచోట్ల పైకప్పులు కూలిపోయాయి. దీంతో రాకపోకలకు రైతులు ఇబ్బందులకు గురౌతున్నారు. కాచవానిసింగారంలో నారాయణ రావుచానెల్ కాలువపై కప్పు విరిగిపోవడంతో విద్యుత్ స్తంభాలను ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసుకుని రైతులు కాలువపై రాకపోకలు సాగిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా జనాలు కాలువలో పడిపోయే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు.

నాటి ఇరిగేషన్ మంత్రి హామీలు నీటి మీది రాతలేనా

గతంలో కాలువ మరమ్మతులు ఇరిగేషన్‌శాఖ పర్యవేక్షణలో సాగునీటి సంఘం పాలకవర్గం నిర్వహించేది. బీఆర్ఎస్ పాలనలో సాగునీటి సంఘాలు లేకపోవడంతో ఇరిగేన్‌శాఖ అధికారులే నారాయణరావు చానెల్ కాలువ, చిన్నకాలువ, పాతకత్వల మరమ్మతు పనులు చేపడుతున్నారు. 2017 మే 23న మండలంలోని ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు మినీ ట్యాంకుబండ్ కోసం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాటి రాష్ట్ర భారీనీటి పారుదలశాఖ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో నారాయణరావు చానెల్, పాతకత్వ, చిన్నకాలవ మరమత్తులను చేపడతామన్నారు. పదేళ్ల గడుస్తున్నా నారాయణరావు చానెల్ కాలువ మరమ్మతులకు నోచుకోలేదు. కొత్త ప్రభుత్వమైన నారాయణరావు చానెల్ కాలువకు మరమ్మతులు చేపట్టి తమ పొలాలకు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మక్త గ్రామంలో కాలువ పక్కన పెరిగిన వృక్షాలు

కాలువల పరిస్థితి అధ్వానం



నారాయణరావు పంట కాలువ వ్యర్థాలు, గుర్రెపుడెక్కాకుతో నిండిపోయి నీరు ముందుకు వెళ్లడంలేదు. కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో చివరి వరకు సాగునీరు అందడం లేదు. రాత్రి సమయాలలో రసాయన వ్యర్థ జలాలను కాలువలో కలుపుతున్నారు. దీంతో ఇప్పుడిప్పుడే నాటు వేసి పోలాలకు ఈ రసాయన వ్యర్థాలతో ఇబ్బందిగా మారింది.

- ఇంద్రారెడ్డి, రైతు ఎదులాబాద్

కాలువలను మేమే శుభ్రం చేసుకుంటున్నాం



వరికోతలు పూర్తిగానే రైతులంతా కలిసి కాలువల్లో పెరిగిన చెట్ల పోదలు, గుర్రెపుడెక్కాకును తొలగిస్తున్నాం. గ్రామాల వారీగా రైతులే డబ్బులు వేసుకొని కాలువలను శుభ్రం చేసుకుంటున్నాం. నారాయణరావు పంట కాలువతో ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు ఆయకట్టు కింద ఉన్న చుట్టూ కాలువలను మేమే మరమ్మతులు చేసుకుంటున్నాం.

-తోటకూర బాలమల్లేష్‌యాదవ్, రైతు, ఎదులాబాద్

మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం





నారాయణరావు పంట కాలువ మరమ్మతుల కోసంపై అధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. కాలువపై పలుచోట్ల పైకప్పుల నిర్మాణం కోసం సైతం నివేదికలు సిద్ధం చేశాము. త్వరలో నారాయణరావు పంట కాలువ మరమ్మతులు చేపడుతాం


- అరిగే పరమేష్, ఇరిగేషన్ ఏఈ



కాచవానిసింగారంలో విద్యుత్‌స్తంభాలపై నుంచి కాలువ దాటుతున్న కార్మికుడు







ప్రజాపాలనలో 1,07,539 దరఖాస్తులు


ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 7 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ డిసెంబర్ 28 నుంచి పదిరోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో మొత్తంగా 1,07,539 దరఖాస్తులు అందాయని చెప్పారు. మండలాలవారీగా.. మంచాల 18,694, యాచారం 16,970, ఇబ్రహీంపట్నం 10,371, అబ్దుల్లాపూర్ మెట్ 15,414, మున్సిపాలిటీల వారీగా ఆదిభట్ల 6,256, ఇబ్రహీంపట్నం 8,894, తుర్కయంజాల్ 22,834, పెద్దఅంబర్‌పేట్ 17,000 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి, పెన్షన్, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. దరఖాస్తుల డేటాఎంట్రీని జనవరి 17 వరకు పూర్తి చేస్తామని చెప్పారు.

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు : సీఐ

మొయినాబాద్ రూరల్, జనవరి 7 : భూ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని మొయినాబాద్ సీఐ గుడి పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలోని సర్వేనంబర్ 145లోని 9 ఎకరాల భూమిలో 145 సీఆర్‌పీసీ సెక్షన్ అమలులో ఉందని.. ఆ స్థలంలోనికి ఎవరైనా వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ స్థలంలో సిబ్బందితో నోటీసుబోర్డు ఏర్పాటు చేయించారు. కాగా, గతంలో హిమాయత్ నగర్ చౌరస్తా సమీపంలోని స్థలానికి సంబంధించి కోర్టులో కేసు కొనసాగింది. తరచూ గొడవలు కూడా జరిగేవి. ఈక్రమంలో ఇటీవల ఒక వర్గానికి అనుకూలంగా తీర్పు రాగా.. జీర్ణించుకోలేని మరో వర్గం అక్కడ అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారు. దాంతో రెవెన్యూ అధికారులు ఇటీవల వెంచర్‌ను తొలగించారు. కొన్నిరోజులుగా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుండడంతో మొయినాబాద్ పోలీసులు చేవెళ్ల ఆర్డీవోకు విషయం తెలిపారు. స్పందించిన ఆయన తాజాగా రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. 145సీఆర్‌పీసీ నోటీసుబోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలంలోకి ఎవరు ప్రవేశించినా చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్, సీఐ గుడిపవన్ కుమార్‌రెడ్డిలు హెచ్చరించారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ఆమనగల్లు, జనవరి 7 : కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని టీపీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన అంతమై ప్రజా పాలన వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ విజయాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి ఆరు గ్యారంటీ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరా సింగ్, నాయకులు తులసీరామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

కడ్తాల్, జనవరి 7: కడ్తాల మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కడ్తాల మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన అన్నారు. కడ్తాలలో ఆధార్ కేంద్రం ఏర్పాటు గూర్చి ఆదివారం సంబంధిత ఉన్నతాధికారులు, మంత్రికి వినతి పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాలె మల్లేశ్ గౌడ్‌తో కలిసి జహంగీర్‌బాబా మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే కడ్తాలతో పాటు ఇతర మండలాల ప్రజలకు కూడా సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.

చదువుతోనే సమాజంలో మార్పు

ఆమనగల్లు , జనవరి 7: ప్రతీ ఒక్కరు చదువుకున్నప్పుడే సమాజంలో మార్పు సాధ్యమని జ్ఞాన ప్రచార సభ నిర్వాహకులు, ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ డివిజన్ సభ్యుడు జంతుక శంకర్ అన్నారు. మహనీయుల ఆశయ సాధనకు అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహనీయుల జీవిత చరిత్రలను, వారి ఆశయాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో జ్ఞాన ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నాయకులతో కలిసి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ జ్ఞాన సమాజ నిర్మాణం ద్వారానే అభివృద్ధి, సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేయాలని అన్నారు. నాయకులు హఫీజ్, గన్నారం బాలు, దరువుల మహేశ్, జంతుక రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గట్టు మైసమ్మజాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

దౌల్తాబాద్, జనవరి 7: మండలంలోని అంతారంలో జరిగిన గట్టు మైసమ్మ జాతర ఉత్సవాల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న నరేందర్‌రెడ్డి

కొడంగల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అండగా నిలిచారు. ఆటోలో ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొన్న ఆయన రావుల్‌పల్లి సమీపంలో బైక్‌పై వస్తున్న యువకుడు ప్రమాదానికి గురికావడాన్ని గమనించారు. వెంటనే బాధితున్ని ఆటోలో ఆసుపత్రికి తరలించారు.

స్పీకర్‌ను కలిసిన బషీరాబాద్ వైస్ఎంపీపీ


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో వైస్ ఎంపీపీ దంపతులు

బషీరాబాద్, జనవరి 7: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బషీరాబాద్ వైస్ఎంపీపీ దంపతులు జడల అన్నపూర్ణ అనంతయ్య దంపతులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాండూరు వాసి, స్నేహితుడు స్పీకర్ కావడంతో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆరుట్ల: జెడ్పీహైస్కూల్ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

మంచాల, జనవరి 7 : మండల పరిధిలోని ఆరుట్ల జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి చదివిన 1994 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళనం జరుపుకున్నారు. నాటి అధ్యాపకులు శ్రీనివాస్‌గౌడ్, రంగారావు, యాదయ్య, రమణారెడ్డి, రవికుమార్, నర్సింగ్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలను సత్కరించారు. పాండాల జంగయ్యగౌడ్, మేకలశ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, మోహన్‌రెడ్డి, మద్దెలరాజు, అనీస్, అరుణ, కృష్ణవేణి, సరితతో పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం

కందుకూరు, జనవరి 7 : పేదల కోసం లయన్స్‌క్లబ్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ మంద జ్యోతి అన్నారు. బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ వారు మండల కేంద్రంలో అన్నదానం చేశారు. ఆదివారం వారాంతపు సంత ఉన్నందున అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు రాష్ట్రవ్యాప్తంగా మీల్స్‌ఆన్‌వీల్స్ అని ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు ఎంపీపీ చెప్పారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంజిరెడ్డి, చార్టర్ అధ్యక్షుడు డాక్టర్ జి. మహేంద్రకుమార్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్, జనవరి 7: చిలుకూరులోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ లగ్గం, బోనాలు నిర్వహించారు. మధ్యాహ్నం భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం మల్లన్న బోనాలు తీశారు. సాయంత్రం అగ్నిగుండాలు, ఒగ్గువారు ఉక్కు గొలుసులు తెంపారు. ఉత్స వాలకు స్థానికులతో పాటు హైదరాబాద్, ప్రాంతాల నుంచి భక్తులు తర లివచ్చారు. చేవెళ్ల మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకు న్నారు. ఎంపీపీ నక్షత్రంజైవంత్, సర్పంచ్ స్వరూప, ఆలయ కమటీ చైర్మ న్ మల్లేష్, కార్యదర్శి గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీరాములు, రమ్యరాజు, దర్గమహేందర్, నరేందర్, నర్సింహాగౌడ్, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం, మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు(ఇన్‌సెట్)

పేదలకు 'అభయహస్తం!'

- 8 రోజుల్లో 5,53,277 దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాపాలనలో దరఖాస్తులకు విశేష స్పందన
- ఆరు గ్యారెండీలపై గంపెడాశలు
- సాఫీగా ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ



ఆమనగల్లు మండలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 7): పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర సర్కారు ముందుకు సాగుతోంది. అర్హులకు ఆరు గ్యారెంటీలను అందించేందుకు తెలంగాణ నూతన ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన' సభలు సాఫీగా ముగిశాయి. జిల్లాలో గత నెల 28న ప్రారంభమై ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహిం చిన ప్రజాపాలన సభలు, అభయ హస్తం దరఖాస్తుల సేకరణ కార్యక్ర మానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజాపాలన కార్యక్రమం ముగింపు సమయం నాటికి మొత్తం 5,53,277 దరఖాస్తులను స్వీకరిం చారు. వాటిల్లో గ్రామ పంచాయతీల నుంచి 2,91,470 దరఖాస్తులు, మున్సి పాలిటీల్లో 2,61,807 చొప్పున దరఖా స్తులు స్వీకరించారు. ఎనమిది రోజుల పాటు కొనసాగిన ప్రజాపాలన కార్య క్రమంలో జిల్లాలోని 21 మండలా ల్లోని 558 గ్రామ పంచాయ తీలు, 16 మున్సిపాలిటీల్లో అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుల్లో గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం ఎక్కువగా దరఖాస్తులు అందాయి. ఈ దరఖా స్తులను ఈ నెల 17 వరకు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ప్రతి రోజు డేటా ఎంట్రీ చేసే విధంగా కలెక్టర్ శశాంక చర్యలు తీసు కుంటున్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి చేపట్టిన ప్రజాపా లన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది.

గ్రామాల్లో తేదీల వారీగా వచ్చిన దరఖాస్తులు

డిసెంబరు 28	29,874
డిసెంబరు 29	57,105
డిసెంబరు 30	57,567
జనవరి 2	47,732
జనవరి 3	32,342
జనవరి 4	25,141
జనవరి 5	19,114
జనవరి 6	22,595

గ్రామ పంచాయతీలు : 558
కుటుంబాల సంఖ్య : 2,46,626
చివరి రోజు వచ్చిన దరఖాస్తులు : 22,595
మొత్తం స్వీకరించిన దరఖాస్తులు : 2,91,470

మున్సిపాలిటీల్లో స్వీకరించిన దరఖాస్తులు

మున్సిపాలిటీలు : 16
వార్డులు : 363
కుటుంబాల సంఖ్య : 2,88,361
కౌంటర్ల సంఖ్య : 2,698
మొత్తం దరఖాస్తులు : 2,61,807

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- సీజీఆర్ ఆధ్వర్యంలో ఘనంగా సంకాంత్రి వేడుకలు
- అలరించిన మహిళల రంగవల్లులు
- సంస్కృతి, సంప్రదాయాన్ని చాటిన భోగిమంటలు

కడ్తాల్ , జనవరి 7: కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపం లోని ఎర్త్‌సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పర్యావరణ బాల చైతన్య కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు , సీజీఆర్ సభ్యులు, మహిళలు ,యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకలు కొనసాగాయి. సీజీఆర్ సంస్థ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంక్రాంతి సంబురాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలకు అద్దం పట్టాయి.



భోగి వేడుకల్లో సీజీఆర్ ప్రతినిధులు

విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి లీలా లక్ష్మారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులకు గాలిపటాలు, తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ వ్యవస్థాపకులు కోర్పోలు లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, నర్సింహ్మారెడ్డి, ది హెల్త్ సెంటర్ డైరెక్టర్ సాయిబాస్కర్ రెడ్డి, బాలచైతన్యకేంద్రాల నిర్వాహకులు రజని కాంత్, కో-ఆర్డినేటర్ దీపిక, మౌసినాబేగం మౌనిక, శిరీష, మమత, వెంక టేశ్, కోటయ్య, వీరేశ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సంస్కృతిని చాటిన చాటిన భోగిమంటలు





చట్టాలపై అవగాహన కల్పించాలి

ఆమనగల్లు, జనవరి 7: చట్టాలు, న్యాయవ్యవస్థపై న్యాయవాదులు ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడు సత్వర న్యాయాన్ని పొందే వీలుంటుందన్నారు. కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో కోదండ రామ్ ఆయన నివా సంలో ఆవిష్కరించారు. ప్రజాచైతన్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో న్యాయవాదులు పాల్గొనాలని సూచించారు. అనంతరం యాదిలాల్ కోదండరామ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోశాధికారి అర్థం నర్సింహ, నాయకులు రాజిరెడ్డి, రాంరెడ్డి, జానకి రామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న కోదండరామ్

పాపన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఆమనగల్లు/మాడ్గుల, జనవరి 7: మాడ్గుల మండలం ఆవురుపల్లి గ్రామంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క అల్లాజీ గౌడ్, ఆమనగల్లు మండల గౌడ సంఘం అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ డిమాండ్ చేశారు. నింధితు లను గుర్తించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడా లని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పట్ట ణంలో నిరసన తెలిపారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేప డుతామని హెచ్చరించారు. నాయకులు సతీష్‌గౌడ్, నర్సింహగౌడ్, నారా యణ గౌడ్, లక్ష్మీపతి, నిరంజన్‌గౌడ్, బాలకృష్ణ గౌడ్, తదితరులు పాల్గొ న్నారు. పాపన్న విగ్రహం ధ్వంసం పట్ల గౌడసంఘం కడ్తాల మండల అధ్యక్షుడు మాలె మల్లేశ్‌గౌడ్ విచారం వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆవురుపల్లిలో లాలయ్యగౌడ్, నారాయ ణగౌడ్, వెంకటయ్యగౌడ్, నర్సింహ తదితరులు నిరసన వ్యక్తం చేశారు.



అభివృద్ధే ధ్యేయంగా ముందుకు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- 25లక్షల సర్పంచ్ స్వంత నిధులతో సీసీ రోడ్డు
- సర్పంచ్‌ను అభినందించిన ఎమ్మెల్యే

కొత్తూర్, జనవరి 7: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో 'మన ఊరు- మనబడి' కార్యక్రమంలో భాగంగా 50లక్షల రుపాయలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతన భవనం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిం చారు. ఎస్‌బీపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో రూ. 25లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభిం చారు. అలాగే రూ.40లక్షలతో నిర్మించబోయే హెచ్‌ఎండీఏ సీసీ రోడ్డు పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పం చ్ అంబటి ప్రభాకర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలాభివృద్ధి కోసం సీఎం ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్‌ను సర్పంచ్ అంబటి ప్రభాకర్ సన్మాంచారు. మాజీ ఎమ్మెల్యే చౌల పల్లి ప్రతాప్‌రెడ్డి, స్థానిక జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మ న్ అగీర్ రవికుమార్‌గుప్త, సర్పంచ్ బాల్‌రాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభించిన అనంతరం నాయకులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జనవరి 7: డీసీసీ అధికార ప్రతి నిధి , ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్య క్షుడు గూడూరు శ్రీని వాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీపాతి శ్రీని వాస్‌రెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీ హి ల్స్ లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించి అభి నందనలు తెలిపారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయినట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి సహక రించాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాస్ రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి

కేటీఆర్‌కు సతీష్‌రెడ్డి శుభాకాంక్షలు

షాబాద్, జనవరి 7 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బీఆర్ ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు పీసరి సతీష్‌రెడ్డి ఆదివారం తెలం గాణ భవన్‌లో మాజీ మంత్రి తారక రామారావుకు పుష్పగుచ్ఛం అంద జేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 7 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియ న్ (ఎస్టీయూ) రంగారెడ్డి జిల్లా శాఖ రూపొందించిన డైరీని ఆదివారం తిరుమల హిల్స్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నా రు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి, నాయకులు పరమే ష, కృష్టారెడ్డి, భార్గవి, బాల నర్సింహ, తాహెర్ ఆలీ, రాజ మల్లేష్, నవీన్, బాలకృష్ణ, శ్రీనివాస్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి


యాచారం : ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకా రుల సంఘం నాయకులు డా.రవీందర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్య మంలో పాల్గొన్నామని, ఉద్యమకారుల కుటుంబాలకు నెలకు రూ.5వేల ఆర్థికసాయం అందించాలని, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాల న్నారు. జంగయ్య, అంజయ్య, అబ్దుల్, ఎండీ ముజీబ్ తదితరులున్నారు.

జీపీ, ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభించిన సర్పంచులు

కొత్తూర్, జనవరి 7: మండల పరిధిలోని మక్తగూడలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, గూడూర్‌లో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాలను ఆ గ్రామాల సర్పంచులు కాట్న రాజు, సత్తయ్య ఆదివారం ప్రారంభించారు. రూ.20లక్షలతో మక్తగూడలో జీపీ భవనాన్ని, రూ.25లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు.

సంక్షేమం పేరుతో

బీఆర్ఎస్ 'సంక్షోభ పాలన'



శివరామకృష్ణారెడ్డి

మహేశ్వరం, జనవరి 7 : ఎంతోమంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలం గాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్ల సంక్షేమం పేరుతో సంక్షోభ పాలన సాగించిన బీఆర్ ఎస్.. కాంగ్రెస్ ప్రభుత్వం నెలరోజుల పాల నను విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని యూత్ కాంగ్రెస్ మీడియా వి భాగం రాష్ట్ర సంయుక్త సమన్వయకర్త కప్పాటి శివరామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ దళితబంధు, దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల వ్యవసాయ భూమి, బీసీ బంధు, గృహలక్ష్మి, గిరిజన బంధు, రెండు పడకలగ దుల ఇళ్లు వంటి హామీలు అమలు పర్చకుండా ప్రజలను మోసం చేసిందని అన్నారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కూడా లేదన్నారు. నెల రోజులకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే.. దాదాపు పదేళ్లు పాలించిన బీఆర్ఎస్‌ను ఏమని విమర్శించాలని ప్రశ్నించారు. బీఆ ర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ సంక్షేమ పథకాల పేరుతో దోపిడీకి పాల్పడి అప్పుల రాష్ట్రంగా తయారు చేశారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి బీఆర్ఎస్ ఎన్నిఎత్తులు వేసినా ప్రజలు నమ్మరని అన్నారు.





పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ టీఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జనవరి 7: పీఆర్‌టీయూ టీఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. వికారాబాద్ పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డి, అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దోమ అమర్‌నాథ్, సంఘం నాయకులు సతీష్‌కుమార్, విశ్వం పంతులు, బీఎం శివకుమార్, ఇందిర, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించి రాయితీ పొందాలి



ఎస్ఐ వేణుగోపాల్

బషీరాబాద్, జనవరి 7: వాహనాలకు సంబంధించి పెండింగ్ చలాన్లు సకాలంలో చెల్లించి రాయితీ పొందాలని బషీరాబాద్ ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు ప్రభుత్వం రాయితీతో కూడిన చెల్లింపులకు ఆవకాశం కల్పించినందున వాహనదారులు వినియోగించుకోవాలన్నారు. గడువులోగా చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాయం చేసే గుణాన్ని కలిగి ఉండాలి



ఇస్తేమా సభల్లో రాత్రి వేళ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఇస్తేమా సభలకు హాజరైన శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పరిగి/పూడూరు, జనవరి 7: కష్టాల్లో ఇతరులకు సాయం చేసే గుణాన్ని కలిగి ఉండాలని ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్ ముఖ్య ప్రతినిధి మౌలానా ఫారూక్ అన్నారు. పరిగి పట్టణంలోని న్యామత్‌నగర్‌లో కొనసాగుతున్న సుబాయి దీని ఇజ్తిమా(ఇస్తేమా) సభలకు ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. జీవితంలో సమయాన్ని ఎవరూ వృథా చేసుకోవద్దన్నారు. ఇస్లాం మతం సూచించిన మార్గాన్ని అనుసరిస్తూ సమాజానికి ఉపయోగపడేలా జీవనం కొనసాగించాలని సూచించారు. ఎవరు ఎంత చదివినా, ఏ స్థాయికి ఎదిగినా, ఇస్లాం బోధనల ప్రకారమే నడుచుకోవాలన్నారు. సమాజంలో ఎవరికీ తల వంచకుండా ముందుకు సాగాలన్నారు. తమ జీవితాన్ని తామే మార్చుకోవాలని, ఇతరుల మీద నిందలు వేస్తూ పాపం మూటగట్టుకోవద్దని చెప్పారు. తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాలని, వృద్ధాప్యంలో వారికి అన్నివిధాలుగా అండగా ఉంటూ ప్రేమగా చూసుకోవాలని హితవు పలికారు. విద్యార్థులు, యువత ఉన్నత స్థాయికి చేరుకునేలా కష్టపడాలని, సమాజానికి తాము ఉపయోగపడే విధంగా తమకు తాము మలచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాముద్దీన్ మర్కజ్ ముఖ్య ప్రతినిధులు మౌలానా జెన్‌షాద్ సాబ్, బాయి ముర్సావలిన్, ముఫ్తీ ముస్లిం, ఏపీ, తెలంగాణ ఇన్‌చార్జి మౌలానా అబ్దుల్ సమద్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి అలీమొద్దీన్, మీర్ మహమూద్ అలీ, వాజీద్ పాల్గొన్నారు. ఇదిలా ఉంటే, ఆదివారం వెయ్యి మంది ముస్లిం యువతీ యువకులకు ఇస్తేమా సభలో సామూహిక వివాహాలు జరిపించారు.

రెండో రోజూ రెండు లక్షల మంది హాజరు

పరిగిలోని న్యామత్‌నగర్‌లో రెండో రోజు ఆదివారం జరిగిన సుబాయి దీని ఇజ్తిమా(ఇస్తేమా) సభలకు రెండు లక్షల మంది ముస్లింలు హాజరయ్యారు. 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ముస్లింలతో కిక్కిరిసింది. ఆదివారం కొనసాగిన ఇస్తేమా సభలకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభల్లో ఐదు సార్లు నమాజ్ నిర్వహించారు. నాలుగుసార్లు తబ్లిక్ జమాతే ముఖ్య ప్రతినిధుల ప్రసంగాలు కొనసాగాయి. ఇస్తేమా సభా ప్రాంగణం పరిసరాల్లో పెద్ద ఎత్తున దుకాణాలు వెలిశాయి.

గడపగడపకు అయోధ్య రామయ్య అక్షింతలు



కులకచర్ల: తిరుమలపూర్‌లో అక్షింతలు పంపిణీ



కీసరలో గడప గడపకు అక్షింతలు అందజేస్తున్న సాయి దత్త పీఠాధిపతి శ్రీ రామానందా ప్రభూజీ

కులకచర్ల, జనవరి 7: మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో ఆదివారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను గడపగడపకు పంపిణీ చేశారు. గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి ఆలయం నుంచి వీధుల మీదుగా శోభయాత్ర నిర్వహించారు. గ్రామ యువకులు, హిందూ బంధువుల ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి తిరిగి అక్షింతలు పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలోని రామాలయంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతీఒక్కరూ అక్షింతలను తలపై చల్లుకోవాలని, ఇంట్లో దీపాలు వెలిగించాలన్నారు.

కొడంగల్: స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం అయోధ్య రాముడి అక్షింతల కలశంతో వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో శివకుమార్‌గుప్త, డాక్టర్ రవీందర్, పూనంచంద్ లాహోటి, నందారం శ్రీనివాస్, హిందూవాహిని సంఘంసభ్యులు పాల్గొన్నారు.

దోమ: అయోధ్య శ్రీరామ తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మోత్కూర్ గ్రామంలో శ్రీరాముడి అక్షింతలను ప్రతీ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలోయువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధారూరు: అయోధ్యలోని శ్రీరామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా హిందూ సమాజం తరపున ధారూరులో ఇంటింటికీ తిరిగి శ్రీరాముడి అక్షింతలను అందజేశారు. స్థానిక వీరభద్రేశ్వర ఆలయంలో సర్పంచ్ చంద్రమౌళి, స్థానికులు పూజలు చేసిన అనంతరం ఊరేగింపు చేశారు. ఇంటింటికి తిరిగి అక్షింతలు అందజేసి ఈ నెల 22న ప్రతి ఇంటిలో ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూజారి కుమార స్వామి, బీజేపీ నాయకుడు రమేశ్, స్థానికులు జగదీష్, అంజయ్య, నర్సింహులు, యువకులు పాల్గొన్నారు.

పరిగి: పరిగి మునిసిపల్ పరిధిలోని ఐదవ వార్డులో అయోధ్య నుంచి వచ్చిన అంక్షింతల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంక్షితలను ఇంటింటికీ తీసుకెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమలో జడ్పీటీసీ బి.హరిప్రియ, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు టి.రామస్వామి, అనూష, లక్ష్మి, వీరేశ్, ఆంజనేయులు, శ్రీశైలం పాల్గొన్నారు.

తాండూరు: ఈ నెల 22 నుంచి 24 వరకు గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో అయోధ్య ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 22న గోశాలలో గోపూజ, వినాయకుడి పూజ, రాములవారి అభిషేకం, సీతారాముల కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవానికి సంప్రదాయ దుస్తుల్లో రావాలని కోరారు. 23సీతారాముల ఊరేగింపు, సంకీర్తనలు, 24 గోశాలలో గీతాపారాయణం, సుందరా కాండ పారాయణం ఉంటుందని తెలిపారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీల్లో ఆదివారం అయోధ్య రామమందిరం అక్షింతలతో స్థానిక ప్రజాప్రతినిధులు ఊరేగింపు నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్లు చాప రాజు, నడికొప్పు ఉమానాగరాజులు తమ వార్డుల్లో ఇంటింటికి తిరిగి రామ మందిర అక్షింతలను ఇంటింటికీ తిరిగి అందజేశారు.

శామీర్‌పేట: అయోధ్య రామయ్య అక్షింతలు అలియాబాద్ గ్రామంలో ఇంటికి పంపిణీ చేశారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలో ఆదివారంగ్రామస్తులు అయోధ్య నుంచి వచ్చిన రామయ్య అక్షింతలను ఆలయం నుంచి ఇంటింటికీ తీసుకెళ్లి పంపిణీ చేశారు. ఏ ఇంటికి వెళ్ళినా మంగళ హారతులు పట్టి అయోధ్య రామయ్య అక్షింతలను స్వీకరిస్తున్నారు. గ్రామస్తులు అయోధ్య రామయ్య అక్షింతలతో పాటు కరపత్రాలను సైతం అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: వెంకటాపూర్‌లో ఆదివారం ఉదయం శ్రీరాముడి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. అంతకుముందు సర్పంచ్ గీతాశ్రీనివాస్ దంపతులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షింతలను తలపై మోస్తూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామారావు, వార్డుసభ్యులు కృష్ణ, నాయకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

కీసర: మండల కేంద్రంలోని కీసరలో ఆదివారం ఇంటింటికీ తిరిగి శ్రీరాముడి అక్షింతలను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీసాయిధామం సాయిదత్త పీఠాధిపతి స్వామి శ్రీరామానందా ప్రభూజీ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తజన బృందం పాల్గొన్నారు.

విహారయాత్రకు బయల్దేరిన విద్యార్థులు



విద్యార్థులతో విహారయాత్రకు వెళ్తున్న ఉపాధ్యాయులు

కులకచర్ల, జనవరి 7: పీరంపల్లి, కామున్‌పల్లి, చేపలగూడెం గ్రామాల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం విహారయాత్రలకు వెళ్లారు. హైదరాబాద్‌లోని చార్మినార్, జూపార్కు, హుసేన్‌సాగర్, గోల్కొండ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, సర్పంచ్‌లు, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్‌లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

ఘట్‌కేసర్, జనవరి 7: నేటితరం అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఘట్‌కేసర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు ఆంజనేయులు, కె.నర్సింహ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎదులాబాద్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉన్నత చదువులతో ఎదైనా సాధించవచ్చని అంబేద్కర్ నిరూపించాడని వివరించారు. కనీస సౌకర్యాలు లేకపోయినా అన్నింటినీ ఎదుర్కొని విద్యలో రాణించాడని తెలిపారు. అనాడే రాజ్యాంగం రాసి సమాజంలో ప్రజలకు అవసరమైన హక్కులను కల్పించిన మహాజ్ఞాని అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దాసు, అశోక్, బాలయ్య రాజేష్, నర్సింగ్‌రావు, అంజయ్య, విష్ణువర్దన్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, జనవరి 7: సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని కల్చరల్ అకాడమిక్ స్పోర్ట్స్ విభాగంలో ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. యూత్ ఫర్ సేవా హైదరాబాద్ చాప్టర్ సమక్షంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 3200 విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అన్ని విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బషీరాబాద్, జనవరి 7: మండల సర్వసభ్య సమావేశం నేడు(సోమవారం) నిర్వహించనున్నట్లు బషీరాబాద్ ఎంపీడీవో రమేష్ తెలిపారు. ఎంపీపీ కరుణ అజయ్‌ప్రసాద్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి హాజరవుతారన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, మండల, డివిజన్ స్థాయి వివిధ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

అభయహస్తం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు



మూడుచింతలపల్లి: అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు



మోమిన్‌పేట్: ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి చరితరెడ్డి

మూడుచింతలపల్లి, జనవరి 7: మూడు చింతలపల్లి మండలంలో అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నామని ఎంపీవో సునిత తెలిపారు. మండల కేంద్రంలోని కేశవరంలో ఆయా గ్రామ కార్యదర్శులతో కలిసి ఆదివారం అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీవో సునిత మాట్లాడుతూ మూడుచింతలపల్లి మండలంలోని 13 గ్రామాల్లో మొత్తం 7వేల అభయహస్తం దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్ ప్రక్రియ చేస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు లను పంచాయితీ కార్యదర్శులు, బిల్‌కలెక్టర్‌ల సహకారంతో ఆన్‌లైన్ చేస్తామన్నారు. ఒక లాగిన్‌కు 100దరఖాస్తులను నమోదు చేస్తామని 25లాగిన్‌లు ఉన్నాయని ఆమె తెలిపారు. ఇందులో కార్యదర్శులు రాజేశ్వర్‌రెడ్డి, మని, హర్షవర్ధన్‌రెడ్డి, అయేషా, సుచిత, గౌతమి, శ్వేత, బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: ప్రజాపాలన సదస్సుల్లో ఆరు గ్యారంటీ పథకాలకు లబ్ధిదారులు అందించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారిణి చరితరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఆదివారం ఆరు గ్యారంటీల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో దాదాపు 13వేలకు పైగా ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో శైలజారెడ్డి, సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల: అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాలకు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకంగా కంప్యూటర్‌లను ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ సరళాదేవి, ఎంపీడీవో నాగవేణి, తహసీల్దార్ మురళీధర్ దగ్గరుండి అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. గడువులోపు నమోదు చేసేందుకు మరిన్ని కంప్యూటర్‌లను సిద్ధం చేస్తామన్నారు. ఉమ్మడి మండలంలోని 44 గ్రామ పంచాయతీల్లో 5 గ్యారంటీలకు 14,193 దరఖాస్తులు రాగా, కొత్త రేషన్ అర్డుల కోసం 3171దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకు 1500 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

బషీరాబాద్: బషీరాబాద్ మండల వ్యాప్తంగా ఆయా పథకాల కోసం గ్రామ సభల్లో 14,500 దరఖాస్తులు అందినట్లు మండల ప్రత్యేకాధికారి రాములు ప్రకటించారు. దరఖాస్తులతో పాటు రేషన్‌కార్డు, ఇతర సమస్యల గురించి తెల్లగాగితంపై విజ్ఞప్తులు స్వీకరించారు. ఎంపీడీవో, తహసీల్దార్, ఈజీఎస్ కార్యాలయాల్లో 30 మందికి పైగా ఆపరేటర్లతో దరఖాస్తుల క్రోడీకరణ జరుగుతుందన్నారు. ఇప్పటికే 2,500 దరఖాస్తులు డేటా ఎంట్రీ పూర్తి చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా అభయహస్తం దరఖాస్తులను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తున్న అధికారులు ఇతర సమస్యలపై తీసుకున్న దరఖాస్తుల నమోదు విషయమై స్పష్టత లేకపోవడంతో వాటిని పక్కన పెడుతున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం తగిన చర్యలు తీసుకుంటామంటున్నారు.

జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపిక



అవార్డుకు ఎంపికైన సుధాకర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

మోమిన్‌పేట్, జనవరి 7: బహుజన సాహిత్య అకాడమిజాతీయ కమిటీ ఆధ్వర్యంలో 2023వ సంవత్సరానికి జాతీయ ఉత్తమ సర్వీస్ సొసైటీ అవార్డుకు వికారాబాద్ జిల్లా సర్వేయర్‌ల సంఘం అధ్యక్షుడు అరిగే సుధాకర్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని కమిటీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆదివారం హైదరాబాద్‌లో ఆహ్వానపత్రం ద్వారా తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి బహుజన సాహిత్య అకాడమి వారు ప్రతీ సంవత్సరం ప్రజా సంఘాల సేవలకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఎంపికైన వారికి అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పి తెలంగాణ అధ్యక్షుడు గౌతమ్, మోమిన్‌పేట్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు డి.వెంకట్, చంద్రకాంత్, సంపత్, నాగయ్య సందీప్, చింటు, జునస్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సీసీ రోడ్డు



బషీరాబాద్, జనవరి 7: ఎక్మాయి గ్రామ పంచాయతీలోని 8వవార్డులో అంతర్గత రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా మారి కాలినడకకు సైతం వీలులేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.గతంలో ఇక్కడా మురుగు కాల్వ కట్టి పైకప్పు బెడ్ నిర్మించకపోవడంతో రాత్రుల్లో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు.ఈ విషయమై పలుమార్లు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పింఛన్ కోసం సర్పంచ్ ఇంటి వద్ద బైఠాయింపు



సర్పంచ్ ఇంటి ఎదుట బైఠాయించిన లబ్ధిదారులు

కులకచర్ల, జనవరి 7: చౌడాపూర్ మండలం మందిపాల్ గ్రామంలో తపాల శాఖ అధికారుల నుంచి పింఛన్ డబ్బులు ఇప్పించాలని లబ్ధిదారులు సర్పంచ్ ఇంటి ముందు బైఠాయించారు. మందిపాల్ గ్రామ పరిధిలో అన్నీ రకాల పింఛన్‌లు 200 వరకు ఉంటాయి. సంబంధిత తపాల అధికారి చౌడాపూర్ నుంచి వచ్చి పంపిణీ చేస్తారు. గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేదని పింఛన్ ఇవ్వడం లేదు. ఆదివారం సాయంత్రం ఇస్తానని చెప్పి వెళ్లిపోయాడు. లబ్ధిదారులు వచ్చి గ్రామపంచాయతీ దగ్గర గుమిగూడారు. సంబంధిత తపాల అధికారి రాకపోవడంతో పింఛన్ లబ్ధిదారులు సర్పంచ్ ఇంటి ముందు బైఠాయించారు. గత రెండు రోజులుగా పింఛన్‌ల కోసం గ్రామ పంచాయతీకి తిరుగుతున్నామని, ఏదో సాకుతో సంబంధిత తపాలా అధికారి ఇవ్వడంలేదని, ఇప్పించాలని కోరారు. స్పందించిన సర్పంచ్ మరం ప్రమీల తపాలా అధికారితో మాట్లాడారు. పింఛన్ యంత్రం పనిచేయడం లేదని, దీంతో పాటు విద్యుత్ సరఫరా లేదని, సోమవారం నుంచి పింఛన్ డబ్బులు అందిస్తామని చెప్పడంతో లబ్ధిదారులు వెళ్లిపోయారు.

క్రైం కార్నర్

పాముకాటుతో వ్యక్తి మృతి

దోమ, జనవరి 7: పాముకాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బడెంపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెద్దింటి బాబు(41) పొలం పనులు చేస్తుండగా పాము(రక్తపింజర) కాటు వేయడంతో చుట్టుపక్కల గమనించి పామును చంపేశారు. అనంతరం బాబును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లకుండా నాటు వైద్యుడి వద్దకు వెళ్లారు. నాటు వైద్యుడు బాబుకు వైద్యం అందించి నయం అయిందని ఇంటికి పంపించాడు. అయితే ఆదివారం ఉదయం చూసేసరికి బాబు మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

- ఒకరి పరిస్థితి విషమం
- నలుగురికి గాయాలు



ప్రమాదంలో గాయాలపాలైన వాహనదారులు

కొడంగల్ రూరల్, జనవరి 7: ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొన్న ఘటన ఆదివారం కొడంగల్ మండలంలోని ఉడిమేశ్వరం గేటు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొడంగల్ మండలంలోని కస్తూర్‌పల్లి గ్రామానికి చెందిన హాజమొద్దీన్ బైక్‌పై ప్యాలమద్ది గ్రామానికి చెందిన సలీమా(అత్త)తో కలిసి తాండూర్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో చిలుముల్‌మైలారం గ్రామం నుంచి చెంగోల్‌కు బైక్‌పై అనంతయ్య, రాయప్ప, అశోక్‌లు బయల్దేరారు. వీరి బైక్‌లు ఉడిమేశ్వరం గేటు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హాజీమొద్దీన్ కుడి కాలు విరిగింది. తలకు బలమైన గాయమైంది. మిగతా నలుగురికి గాయాలు కావడంతో గమనించిన వాహనదారులు 108 వాహనానికి సమాచారం అందించి కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో హాజీమొద్దీన్ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

- పలువురికి గాయాలు

మూడుచింతలపల్లి, జనవరి 7: అతివేగంగా వస్తున్న కారు ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన తుర్కపల్లి గ్రామంలోని జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంజీబీఎస్ నుంచి ఆర్టీసీ బస్సు జగిత్యాలకు బయల్దేరింది. ఈ క్రమంలో తుర్కపల్లి చెక్‌పోస్ట్ వద్దకు రాగానే ఎదురుగా ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంగా వస్తూ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. బస్సులో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్ట్

మేడ్చల్ టౌన్, జనవరి 7: నూతన్‌కల్ గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎస్‌వోటీ పోలీసులు పట్టుకుని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతన్‌కల్ గ్రామానికి చెందిన జలాలుద్దీన్, గోపాల్‌సింగ్, భాగ్యశ్రీ వికాస్‌బార్డే, ప్రసాద్ అనే నలుగురు కొంత కాలంగా గ్రామ పరిధిలో గంజాయి విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు ఆదివారం వారి స్థావరాలపై దాడులు నిర్వహించారు. అక్కడ నలుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి 3కిలో 115గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రంగరాజు

వికారాబాద్, జనవరి 7: కాంగ్రెస్ నాయకుడు రంగరాజు తన జన్మదిన సందర్భంగా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించాడు.

కొడంగల్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే ఆర్.గురునాథ్ రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్ ముఖ్, మున్సిపల్ ఛైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డిలు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాండూరు, జనవరి 7: తాండూరులోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 2000-01 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా ఒకేచోట చేరారు. 23ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా తమ ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమలాంటి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి తీర్చిదిద్దిన గురువులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అప్పటి వారి ఉపాధ్యాయులు శ్యామలప్ప ఆచారిని స్మరించుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత్ రెడ్డి, పాపిరెడ్డి, గౌరిశంకర్, లలిత, నిర్మల, ప్రేమిల, రాజేశ్వరి, సులోచన, శోభారాణి, గోపాల్, గోవర్దన్, నర్సింహులు, చంద్రయ్య, పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు మైసమ్మ జాతర వాయిదా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈవో భాగ్యలక్ష్మి

ఘట్‌కేసర్, జనవరి 7: ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతరను వారం రోజుల పాటు వాయిదావేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈనెల 21న గట్టుమైసమ్మ జాతరను నిర్వహించాలని ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కాగా ఈనెల 21 నడిఊర్ల పండగ నిర్వహించిన అనంతరం ఈనెల 28వ తేదీన గట్టుమైసమ్మ జాతర నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధానంగా నడిఊర్ల పండుగను ఘనంగా నిర్వహించిన అనంతరమే జాతర నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, పట్టణపెద్దలు, కులసంఘాల పెద్దలు ఎకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పల్లుల మాధవరెడ్డి. మాజీ ఎంపీపీ బండారి దాసు, ఈవో భాగ్యలక్ష్మి, ఆయాపార్టీల నాయకులు. కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.